క్లుప్తంగా

బియ్యం కార్డులకు దరఖాస్తు చేసుకోండి



బియ్యం కార్డుల కోసం వచ్చిన వారితో కిటకిటలాడుతున్న సచివాలయం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో అర్హులైన వారు బియ్యం కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీదేవి కోరారు. బుధవారం స్థానిక సచివాలయంలో బియ్యం కార్డుల దరఖాస్తులను పరిశీలించి ఆమె మాట్లాడారు. రైస్ కార్డులలో పిల్లలు, కోడలి పేర్లు కలపడం, సభ్యుల తొలగింపు, కొత్త బియ్యం కార్డు, కార్డు విభజన, చిరునామా మార్పులు చేయడం చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు



మురుగునీటిలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుద్ధ్య కార్మికురాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాలలో బుధవారం సర్పంచ్ జొన్నల రమణమ్మ పారిశుద్ధ్యం మెరుగు చర్యలు తీసుకున్నారు. గ్రామం, దళితవాడల్లోని కాలువల్లో మురుగును పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. అలాగే, వీధుల్లో చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. తాగునీటి ఓవరు హెడ్ ట్యాంకులో క్లోరినేషన్ చేయించారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి జొన్నలగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు సత్కారం



హెడ్ కానిస్టేబుల్ సారథిని సత్కరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ విజయవాడకు బదిలీపై వెళ్లిన హెడ్ కానిస్టేబుల్ సారథిని బుధవారం సిబ్బంది సత్కరించారు. గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనకు చిరుకానుక అందజేశారు. కార్యక్రమంలో సీఐలు మంజునాథరెడ్డి, జయచంద్ర, శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌ఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గుడిమల్లంలో కేంద్ర ఆడిటర్ జనరల్ అధికారి



ఆలయంలో కేంద్ర ఆడిటర్ జనరల్ అడిషనల్ డిప్యూటీ కంట్రోలర్ ఎంఎస్ రేనా ప్రకాష్

ఏర్పేడు: న్యూఢిల్లీకి చెందిన ఆడిటర్ జనరల్ విభాగం అడిషనల్ డిప్యూటీ కంట్రోలర్ ఎంఎస్ రేనా ప్రకాష్ బుధవారం ఏర్పేడు మండలం గుడిమల్లంలోని పరశురామేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు స్వాగతం పలికి, ప్రత్యేక దర్శనం చేయించారు. పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించి, వేదపండితుల ఆశీర్వచనాలు పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు.

వేషాలతో మొక్కులు చెల్లించిన భక్తులు



జాతర వేషాలతో భక్తులు

నారాయణవనం: మండలంలోని పాలమంగళం ఉత్తరపు కండ్రిగలో జాతర వేషాలతో భక్తులు మొక్కులు చెల్లించారు. బుధవారం ఉదయం కన్నిపుట్టాలమ్మ ఆలయంలో ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. మహిళలు పిండి దీపాలు వెలిగించారు. సాయంత్రం యువకులు, పిల్లలు వివిధ వేషాలు ధరించి గ్రామ వీధుల్లో సందడి చేశారు. వేషాలతో కన్నిపుట్టాలమ్మను దర్శించుకున్నారు. రాత్రి గంగమ్మను నడివీధిలో ప్రతిష్టించారు. గురువారం సాయంత్రం నిమజ్జనం చేస్తామని జాతర నిర్వాహకులు తెలిపారు.

ఏమాయె చంద్రన్న బీమా..?

- దరఖాస్తులు స్వీకరించని వైనం
- గత ప్రభుత్వంలో వైఎస్సార్ బీమాతో ఆసరా



వరదయ్యపాళెం: ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలిచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా వాటి నెరవేర్చిన పాపానపోలేదు. కనీసం కుటుంబాల్లో చనిపోయినవారికి ఇస్తామన్న చంద్రన్న బీమా పథకాన్ని కూడా అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. ఫలితంగా కుటుంబ పెద్దను కోల్పోతే పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఠంఛన్‌గా..

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాల్లో 18 నుంచి 50 సంవత్సరాల్లోపు, 50 నుంచి 60 సంవత్సరాలు వారు ఎవరైనా మృతి చెందితే రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు ఒక్కో కుటుంబానికి వైఎస్సార్ బీమా మంజూరయ్యేది. మృతి చెందిన వెంటనే వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది మృతుడి ఇంటికి వెళ్లి తక్షణ సాయంగా రూ.10 వేలు ఇచ్చేవారు. మిగతా సొమ్ము 15 రోజుల్లో బాధితుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేది. ఈ బీమా సొమ్ము కోసం ప్రభుత్వమే బీమా ప్రీమియం కట్టేది. తద్వారా కులం, మతం, పార్టీలు చూడకుండా ప్రతి పేద కుటుంబానికీ సత్వర సాయం అందేది.

సత్యవేడు నియోజకవర్గంలో..

సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో 2019 నుంచి 2024 వరకు 826 కుటుంబాలకు పరిహారాన్ని గత ప్రభుత్వ హయాంలో అందజేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కరికీ ఈ పథకాన్ని ఇంత వరకు వర్తింపచేయలేదు.

పేరు మార్పుతోనే సరి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీమాగా పేరు మార్చి దాని అమలును మాత్రం గాలికొదిలేశారు. సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలకు రూ.10 లక్షలు అందిస్తామని ఎన్నికల ముందు కూ టమి నేతలు ప్రజలను మభ్యపెట్టే మాటలు చెప్పా రు. అయితే గద్దెనెక్కి నెలలు గడుస్తున్నా బాధిత కుటుంబాలకు బీమా సొమ్ము అందడం లేదు.

ప్రారంభమవ్వని వెబ్‌సైట్

2024 మే తర్వాత కూటమి ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం వెబ్‌సైట్‌ను తొలగించింది. ఆ తర్వాత కొత్తగా పేరు పెట్టిన చంద్రన్న బీమా వెబ్‌సైట్ మాత్రం ప్రారంభించలేదు. బీమా నమోదు చేయలేదు. మృతి చెందిన కుటుంబాల నుంచి క్లైమ్స్ స్వీకరించేందుకు మార్గదర్శకాలను ఇవ్వలేదు. బీమా దరఖాస్తులు స్వీకరించేందుకు ఇప్పటికీ ఎలాంటి ఆదేశాలు లేవని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఆయా కుటుంబ యజమానులను, సభ్యులను కోల్పోయిన బాధితులు బీమా సొమ్ము కోసం ఎదురు చూస్తున్నారు.

బీమా మంజూరు చేయాలి



బడుగు, బలహీన వర్గాల కుటుంబాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు చంద్రన్న బీమా కింద మంజూరు చేస్తామన్న బీమా సొమ్మును ప్రభుత్వం మంజూరు చేయాలి. దీని కోసం బాధిత కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఎంతైనా ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బాధిత కుటుంబాల ఇంటికెళ్లి బీమా సొమ్ము ఇచ్చారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. పేద ప్రజలకు ఎంతో ధీమా కలిగించే బీమా పథకంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదు.

– నూకతోటి రాజేష్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, సత్యవేడు నియోజకవర్గం

శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



ఇందిరానగర్‌లో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

వరదయ్యపాళెం: పరిసరాల శుభ్రతను పాటిస్తే ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని వరదయ్యపాళెం ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ద్వైత అన్నారు. బుధవారం పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా స్థానిక ఇందిరానగర్ వీధుల్లో వైద్య సిబ్బందితో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల శుభ్రత గురించి స్థానికులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా నివాసాలు ఉన్న ప్రాంతంలో మురుగునీటి నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు.

పట్టపగలే చోరీ!

సత్యవేడు: స్థానిక సుబ్రమణ్యస్వామి గుడి మార్గం సమీపంలోని ఎయిర్ కూలర్ మెకానిక్ షాపు నడుపుతున్న వినోద్ షాప్‌లో ఉదయం చోరీ జరిగినట్లు బాధితుడు తెలిపాడు. బుధవారం ఉదయం షాపు తెరిచి బయటకు వెళ్లాడు. స్కూటీపై గుర్తు తెలియని వ్యక్తి షాపులోకి వచ్చి సుమారు రూ. 10వేల విలువైన ఎయిర్ కూలర్ సామగ్రి అపహరించుకుపోయాడు. షాపులోని సీసీ కెమెరాలో ఇది రికార్డు అయ్యింది. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిత



గురుసాత్వికను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి ఎన్టీఆర్‌నగర్‌లోని సరస్వతీబాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతి చదువుతున్న జనమాల గురుసాత్విక సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించడంతో ఆబాలికను బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జనమాల గురుసాత్విక ఆల్ ఇండియా సైనిక్ స్కూల్‌కు ప్రవేశపరీక్షల్లో అర్హత సాధించడం సంతోషకరమన్నారు. చిన్నారికి జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, జనమాల గురవయ్య, గోపి, సాధన మున్నా రాయల్, సురేష్, శరవణకుమార్, కంఠా ఉదయ్‌కుమార్, ఆశా కిరణ్, మునిచందు, చారుశీల, కల్యాణ్, సుధీర్, విజయ్ కుమార్‌రెడ్డి, మునికుమార్, లోక పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



సచివాలయ సిబ్బందికి యోగా శిక్షణ ఇస్తున్న యోగా గురువులు



యోగా చేస్తున్న విద్యార్థులు

రేణిగుంట: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని యోగా గురువు మాండవ్య పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా రేణిగుంట మండలం గాజుల మండ్యంలోని శిక్షణ కేంద్రంలో బుధవారం యోగా గురువు మాండవ్య ఆధ్వర్యంలో తరగతులు నిర్వహించారు. మండల పరిషత్ ఏఓ పర్యవేక్షణలో సచివాలయ, పంచాయతీ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ రవి, ఈఓలు గిరిధర్ రెడ్డి, బాలాజీ, సర్పంచ్ గంగారి రమేష్, ఎంపీటీసీ సభ్యులు జువ్వల ధనంజయరెడ్డి, వాసుదేవ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రేణిగుంట, గుత్తివారిపల్లి, కరకంబాడి శిక్షణ కేంద్రాల్లో తరగతులు కొనసాగాయి.

యోగా శిక్షణ సద్వినియోగం చేసుకోండి

శ్రీకాళహస్తి: యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బాలయ్య అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన యోగా శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని, విద్యార్థులతో కలిసి యోగా చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ వరకు పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు, మున్సిపల్ కార్యాలయం, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో భాస్కరపేట, బాబుఅగ్రహారం ఉన్నత పాఠశాలల్లో యోగా శిక్షణ జరుగుతోందన్నారు.

యోగాసనాలపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ హైస్కూల్లో బుధవారం యోగాసనాలపై యోగా గురువు సురేష్‌నాయుడు అవగాహన కల్పించారు. ఎంఈఓ-2 మునిసుబ్రమణ్యం, కార్యదర్శి సుబ్రమణ్యం, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బోర్డు మాయం.. ప్రమాదం ఖాయం

అది జాతీయ రహదారి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే మార్గం. అద్దంలా ఉంటుందని, మలుపులు, తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, మలుపుల్లో సూచిక బోర్డులు ఉంటాయనుకుంటే తప్పులో కాలేసినట్టే. సూచిక బోర్డుల లేమి.. ఉన్నా కనిపించకపోవడంతో ఆ మార్గంలో ప్రయాణం ప్రాణాంతకంగా మారింది. ఇదీ 716–ఎ జాతీయ రహదారి దుస్థితి.



గోవిందప్పనాయుడు కండ్రిగ ఇరుకు వంతెన వద్ద చెట్టు కొమ్మల మధ్య ఉన్న సూచిక బోర్డు

నారాయణవనం: జాతీయ రహదారిలో ప్రమాదాల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన హెచ్చరిక, సూచికల బోర్డుల విషయంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కొట్టిచ్చినట్లు కలిపిస్తోంది. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో, ప్రమాదక మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తుంటారు. నారాయణవనం మండలంలోని 716–ఎ జాతీయ రహదారి ఇరుకు వంతెనలపై, పాఠశాల జోన్ల సమీపంలో, స్పీడ్ బ్రేకర్లకు ముందు ఏర్పాటు చేసిన సూచికల బోర్డులు కనిపించడం లేదు. గోవిందప్పనాయుడు కండ్రిగ ఇరుకు వంతెన కిరువైపులా ఏపుగా పెరిగిన చెట్ల మధ్యన సూచిక బోర్డు ఉండడంతో వాహన చోదకులు గుర్తించ లేకపోతున్నారు. చిత్తూరుకండ్రిగ స్పీడ్ బ్రేకర్ వద్ద సూచిక బోర్డు చోరీకి గురైంది. దీంతో స్పీడ్ బ్రేకర్లను గుర్తించలేక వాహన చోదకులు ప్రమాదానికి గురవుతున్నారు. నైనారుకండ్రిగ పాఠశాల వద్ద సూచిక బోర్డు తలకిందులుగా ఏర్పాటు చేశారు. మలుపులు ఓ వైపు ఉంటే సూచిక బోర్డులు మరో వైపు ఉన్నాయి. వీటితో వాహన చోదకులు అయోమయానికి గురవుతున్నారు.



చిత్తూరుకండ్రిగ స్పీడ్ బ్రేకర్‌కు ముందు చోరీకి గురైన బోర్డు



నైనారుకండ్రిగ స్కూల్ జోన్ వద్ద తలకిందులుగా బోర్డు

పలువురికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



అనురాధకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: మండలంలో మృతి చెందిన పలువురి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ సభ్యురాలు అనురాధ ఇటీవ ల మరణించారు. బుధవారం జరిగిన ఆమె కర్మ క్రియలకు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే వరదరాజస్వామి ఆలయ స మీపంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు మ ల్లెంకొండ రాజేశ్వరి, తొట్టంబేడు మండలంలోని ష ణ్ముకం శివ కర్మక్రియలకు హాజరయ్యారు. శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డి కండ్రిగలో మాజీ సర్పంచ్ రొమ్ముల బత్తిరెడ్డి సతీమణి సుబ్బమ్మ బుధవారం మృతి చెందింది. ఆమె మృతదేహానికి మాజీ ఎమ్మె ల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసు లు, రామచంద్రారెడ్డి, చంద్రరాజు, కొండుగారి కృష్ణ, శరవణకుమార్, శ్రీనివాసులురెడ్డి, మున్నా రా యల్, సురేష్, పఠాన్‌ఫరీద్, జుంలేసా, పెరుమాల్, కుమార్, గంగిరెడ్డి, దయారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, బాలిరెడ్డి పాల్గొన్నారు.

సరైన కోర్సుల ఎంపికతో లక్ష్యసాధన సులువు



విద్యార్థులతో హర్షవర్థన్‌రెడ్డి

ఏర్పేడు: సరైన కోర్సుల ఎంపికతో లక్ష్యసాధన సులువు అవుతుందని, విద్యార్థుల భవిష్యత్తు కోసం తమకు అభిరుచి ఉన్న కోర్సులను ఎంపిక చేసుకోవాలని జేసీఐ ఇండియా చైర్మన్ డాక్టర్ ఎన్‌టీ హర్షవర్థన్‌రెడ్డి అన్నారు. ఏర్పేడు మండలం నచ్చనేరి సమీపంలోని ఎస్‌ఓఎస్ బాలల గ్రామంలో బుధవారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి తర్వాత ఉన్న విద్యావకాశాలు, వృత్తి కోర్సులు, స్కాలర్‌షిప్‌లు, వివిధ రంగాల్లో ఉన్న ఉద్యోగావకాశాల గురించి వివరించారు. ఎస్‌ఓఎస్ బాలల గ్రామం లొకేషన్ ఇన్‌చార్జ్ సత్యనారాయణ, కో వర్కర్ మునిరత్నం పాల్గొన్నారు.

గంగమ్మకు అంబలి

- సదవాలమ్మకు పొంగళ్లు
- సత్యవేడు జాతర చాటింపు
- జాతరకు వందేళ్ల ఘన చరిత్ర

సత్యవేడు: సత్యవేడులో జాతర సందడి మొదలైంది. బుధవారం స్థానిక నడివీధి గంగమ్మ గుడి వద్ద చలువ పందిళ్లు వేసి భక్తులు గంగమ్మకు అలంకరించి పసుపు, కుంకుమ, వేపాకు సమర్పించారు. కర్పూర హారతులు ఇచ్చి, కొబ్బరి కాయలు కొట్టి, అంబలి పోశారు. మధ్యాహ్నం సదవాలమ్మ గుడి వద్ద పొంగళ్లు పెట్టారు. జూన్ 11, 12 తేదీలలో సత్యవేడులో జాతర నిర్వహిస్తారు. జాతరకు 15 రోజుల మునుపు వచ్చే బుధవారం చాటింపు వేయడం, రాత్రి 8 గంటలకు అమ్మవారి కలశం గ్రామంలో ఊరేగించడం పరిపాటి. జాతర సందర్భంగా ఊరికి నలుదిక్కులలో అష్టబంధన పూజలు చేస్తారు. రెండవ బుధవారం గుడి వద్ద అంబలి పోస్తారు. చల్లాతమ్మ గుడివద్ద రెండో పర్యాయం పొంగళ్లు పెడుతారు.

వందేళ్ల ఘన చరిత్ర

సత్యవేడు జారతకు వందేళ్ల పై చిలుకు చరిత్ర ఉంది. సత్యవేడులోని సదవాలమ్మ(గంగమ్మ) సృష్టి, స్థితి లయలకు మూల కారకురాలైన శక్తి ప్రతిరూపమని, ఏటా జాతర నిర్వహిస్తే వర్షాలు పడి పంటలు పండుతాయని ఇక్కడి ప్రజలు భావిస్తారు. ఏటా నిర్వహించే ఈ జాతరకు చుట్టుపక్కల ఉన్న 50 గ్రామాల ప్రజలు హాజరవుతారు.

విద్యుత్ దీపాల అలంకరణ

జాతర చాటింపు పురస్కరించుకుని ప్రంచాయతీలోని మూడు రోడ్ల కూడలి వద్ద గల గడియారం స్తంభాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించడమే కాకుండా గంగమ్మ గుడి నుంచి కూడలి వరకు దాదాపు 300 మీటర్ల దూరం చలువ పందిళ్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

గాంధీరోడ్డులో అంగళ్లు

జాతర సందర్భంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే చిరు వ్యాపారులు రోడ్డు ఇరువైపులా అంగళ్లు ఏర్పాటు చేస్తారు. వంటలకు అవసరమైన పాత్రలు, పిల్లల ఆటబొమ్మలు, గాజులు, టెంకాయల విక్రయాలు, పలు వ్యాపారాల దుకాణాలు రోడ్డు పొడవునా వెలుస్తాయి. అలాగే రంగుల రాట్నాలు ఏర్పాటు చేస్తారు.

ట్రాఫిక్ మళ్లింపు

గంగమ్మ గుడి వద్ద చలువ పందిళ్లు, అమ్మవారికి పర్ణశాల ఏర్పాటు చేయడంతో పోలీసులు 5వ తేదీ నుంచి ట్రాఫిక్ మళ్లించనున్నారు. సత్యవేడు-చెన్నై రోడ్డు నుంచి వెళ్లే వాహనాలను పల్లపు వీధి, దేవాంగపురం వీధుల మీదుగా మాదపాకం-కవరపేట రోడ్డుకు మళ్లించనున్నట్టు సీఐ మురళీనాయుడు, ఎస్‌ఐ రామస్వామి చెప్పారు.



అలంకరణలో సత్యవేడు సదవాలమ్మ



గంగమ్మ గుడి వద్దకు అంబలి తీసుకువచ్చి పాత్రలో పోస్తున్న మహిళ



సదవాలమ్మ గుడి వద్ద పొంగళ్లు పెడుతున్న మహిళలు

సర్వర్ డౌన్‌తో తప్పని తిప్పలు



సర్వర్ సమస్యతో వేచి ఉన్న జనం

నాగలాపురం: రేషన్ కార్డుల కోసం సచివాలయంలో దరఖాస్తు, మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే నాగలాపురం సచివాలయం–1 లో 11 మంది సిబ్బందికిగాను ఒక్కరు మాత్రమే ఉండడంతో అవసోపాలు పడుతున్నారు. ఓ వైపు ఆధార్ నమోదు, మరో వైపు రేషన్ కార్డు, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరు..ఇత్యాది పనులు చేయలేక చేతులెత్తేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. మరోపక్క సర్వర్ సమస్యతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సర్వర్ పనిచేయక పడిగాపులు కాయాల్సి వస్తోంది. రేషన్ కార్డులు మార్పులు–చేర్పులకు ఈ నెల 30వ తేదీ వరకు ప్రభుత్వం గడువు కేటాయించింది. సర్వర్ సమస్య మూలాన గడువు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.